ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శుక్రవారం 5 జూలై 2024

బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేక అధికారులు 8లో..

మహనీయుల స్ఫూర్తిని కొనసాగించాలి 8లో..

అంగన్‌వాడీ సిబ్బందిలో ఆందోళన

- అంగన్‌వాడీ కేంద్రాల్లో జీవో 10 అమల్లోకి..
- 65 ఏళ్లు నిండితే పదవీ విరమణే..
- జిల్లాలో 99 మంది బాధితులు..
- బెనిఫిట్స్‌ను పెంచాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, హెల్పర్లుగా పని చేస్తున్న వారికి 65 ఏళ్లు నిండితే తప్పనిసరిగా పదవీ విరమణ చేయాల్సిందేనని, విధుల్లో కొనసాగడానికి వీలు లేదని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏప్రిల్ 30వ తేదీ నాటికి 65 ఏళ్లు నిండిన టీచర్లు, హెల్పర్లను గుర్తించాలని రాష్ట్ర ఉన్నతాధికారులు జిల్లా అధికారులకు గత నెల 29వ తేదీన మెమో నంబర్. 1334/ఐసీడీఎస్-1/2024 జారీ చేశారు. ఈ మేరకు జిల్లాలో 26 మంది టీచర్లు, 73 మంది హెల్పర్లు ఉన్నట్లు గుర్తించి వారిని విధులకు హాజరుకావొద్దని చెప్పడంతో వాళ్లు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ప్రభుత్వం తీసుకున్న ఆకస్మిక నిర్ణయంతో ఆందోళనకు గురవుతున్నారు.

పదవీ విరమణ అనంతరం తమకు కల్పించే బెనిఫిట్స్ మొత్తాన్ని పెంచకుండానే హఠాత్తుగా హఠాటిన తొలగింపు నిర్ణయం తీసుకోవడంతో వాళ్లు హతాశయులయ్యారు. ఏళ్ల తరబడి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చాలీచాలని వేతనాలతో సేవలు అందించిన తమకు గౌరవప్రదంగానైనా పదవీ విరమణ చేసే అవకాశం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదవీ విరమణ అనంతరం ఇచ్చే బెనిఫిట్స్ పెంచే విషయాన్ని తేల్చకుండానే పక్కన బెట్టాలనే ప్రభుత్వ చర్యను నిరసిస్తూ గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట పదవీ విరమణ పొందిన టీచర్లు, హెల్పర్లు ధర్నా చేశారు.

జిల్లాలో 706 అంగన్‌వాడీ కేంద్రాలు..

జిల్లాలో 706 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వీటిలో 664 మంది టీచర్లు, 552 హెల్పర్లు విధులు నిర్వహిస్తున్నారు. 42 టీచర్ పోస్టులు, 154 హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తాజాగా 65 ఏళ్లు నిండిన వారిలో పెద్దపల్లి ప్రాజెక్టు పరిధిలో ఐదుగురు టీచర్లు, 38 మంది హెల్పర్లు, రామగుండం ప్రాజెక్టు పరిధిలో నలుగురు, 13 మంది టీచర్లు, మంథని ప్రాజెక్టు పరిధిలో 17 మంది టీచర్లు, 31 మంది హెల్పర్లు పదవీ విరమణ పొందారు. దీంతో 68 టీచర్ పోస్టులు, 227 హెల్పర్ పోస్టులు ఖాళీగా ఏర్పడ్డాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడిచే అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే టీచర్లు, హెల్పర్లకు పదవీ విరమణ లేదు. స్వచ్ఛందంగా టీచర్లు, హెల్పర్లు పదవీ విరమణ చేస్తే తప్ప పోస్టులు ఖాళీ ఏర్పడేవి కావు.

ఈ కేంద్రాల్లో 5 ఏళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించడంతో పాటు విద్యా బుద్ధులు నేర్పించాల్సి ఉంటుంది. బాలింతలు, గర్భి ణులకు సైతం పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. ఇవేగాకుండా ఇతర త్రా విధులను కూడా అంగన్‌వాడీ టీచర్లకు అప్పగిస్తుంటారు. వీరి పదవీ విరమణకు సంబం ధించి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పదవీ విరమణ వయస్సును నిర్ధారించాయి. ఆంధ్రప్రదేశ్‌లో 60 ఏళ్లు, కర్ణాటకలో 58 ఏళ్లు, తమిళనాడులో 60 ఏళ్లు నిండిన తర్వాత పదవీ విరమణను అమలు చేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో కూడా 65 ఏళ్లకు పదవీ విరమణ చేయా లని గత ఏడాది సెప్టెంబరు 5వ తేదీన బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీవో 10 జారీ చేసింది. అప్పటివరకు పదవీ విరమణ అనంతరం టీచర్లకు 60 వేలు, హెల్పర్లకు 30 వేల రూపాయల బెనిఫిట్స్ కింద ఇచ్చేవాళ్లు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వం టీచర్లకు లక్ష, హెల్పర్లకు 50 పెంచుతూ జీవోలో పేర్కొంది. ఈ జీవో వెలువడిన అనంతరం ఇతర సమస్యలతో పాటు పదవీ విరమణ పొందిన టీచర్లకు 2 లక్షలు, హెల్పర్లకు ఒక రూపాయల బెనిఫిట్స్ ఇవ్వాలని 24 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా విధులు బహిష్కరించి సమ్మె చేపట్టారు. దీంతో అప్పటి ప్రభుత్వ పెద్దలు, అధికారులు బెనిఫిట్స్‌ను పెంచుతామని హామీ ఇవ్వడంతో అక్టోబరు 4న సమ్మెను విరమించారు. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో హామీ నెరవేరలేదు.

ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ సీట్లు దక్కించుకుని అధికారంలోకి వచ్చింది. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు తమ సమస్యల పరిష్కారం కోసం కొత్త ప్రభుత్వానికి వినతి పత్రాలు ఇవ్వడంతో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారం కాక పోవడంతో జూన్ 7వ తేదీన ఐసీడీఎస్ డైరెక్టరేట్ కార్యాలయం ఎదుట

నెరవేరని హామీలు..

అంగన్‌వాడీలు ధర్నా చేశారు. డైరెక్టర్ వారితో చర్చలు జరిపి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుక వెళతామని చెప్పారని టీచర్లు, హెల్పర్లు చెప్పారు. జూన్ 17న మంత్రి సీతక్క సైతం మహబూబాబాద్ పర్యటనలో టీచర్లు, హెల్పర్ల పదవీ విరమణ అనంతరం ఇచ్చే బెనిఫిట్స్‌ను 2 లక్షలు, ఒక లక్షకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నామని ప్రకటించినట్లు తెలిపారు.

కానీ అవేమి లేకుండానే ఏప్రిల్ 30 వరకు 65 ఏళ్లు నిండిన వారందరినీ తొలగించి, టీచర్లకు ఒక లక్ష, హెల్పర్లకు 50 వేల బెనిఫిట్స్ ఇవ్వాలని అధికారులు సర్క్యులర్ జారీ చేశారని పేర్కొన్నారు. తమను అవమాన పరిచే విధంగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు ఇచ్చే బెనిఫిట్స్‌ను 2 లక్షలు, ఒక లక్షకు పెంచాలని, అప్పటి వరకు తమను విధుల్లో కొనసాగించాలని టీచర్లు, హెల్పర్లు డిమాండ్ చేస్తున్నారు.

నేటి నుంచి విలోచవరంలో స్యాండ్ ట్యాక్సీ ప్రారంభం

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మంథని అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఈనెల 5న ఉదయం 10 గంటల నుంచి ఆన్‌లైన్ స్యాండ్ ట్యాక్సీ ఇసుక విధానాన్ని ప్రారంభిస్తున్నామని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఒక ప్రకటనలో తెలిపారు. మంథని మండలం విలోచవరం గ్రామంలోని ఇసుక రీచ్ నుంచి స్యాండ్ టాక్సీ విధానాన్ని మంథని అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ప్రారంభిస్తున్నామని, మంథని పరిధిలో ఇసుక అవసరమున్న వినియోగదారులు ఆన్‌లైన్ మన ఇసుక వాహనం పోర్టల్ ద్వారా బుక్ చేసుకోవాలని, ఒకరోజు లోపల ఇసుక అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని, మంథనిలో ప్రైవేట్ వాహనాల ద్వారా ఇసుక సరఫరా చేయడానికి వీలులేదని, స్యాండ్ ట్యాక్సీ ద్వారా మాత్రమే ఇసుక పొందాలని పేర్కొన్నారు.

దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శం


నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, శ్యామ్‌ప్రసాద్‌లాల్

పెద్దపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి మనందరికీ ఆదర్శమని అదనపు కలెక్టర్లు జే అరుణశ్రీ, జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్ అన్నారు. గురువారం వారు కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య సాయుధ పోరాటంలో నేలరాలిన తొలి రక్తపు చుక్క అని, నిరంకుశ పాలన నుంచి స్వేచ్ఛ వాయువులు పీల్చేందుకు ఆత్మగౌరవ పతాకాన్ని ఎగురవేసేందుకు ప్రాణాలు పణంగా పెట్టిన గొప్ప యోధుడు కొమురయ్య అని, ఆయన చూపిన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డి, జడ్పీటీసీ గంటా రాములు యాదవ్, సంఘ అధ్యక్షులు మల్లేశం, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవార్డుల ప్రదానం


మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సొసైటీ సభ్యులు

కాల్వశ్రీరాంపూర్, జూలై 4: కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన సింగిల్‌విండో సొసైటీ రాష్ట్రంలోని వ్యాపార రంగంలో మొదటి స్థానంలో నిలిచింది. దీంతో టీఎస్ క్యాబ్ హైదరాబాద్‌లో నేషనల్ కో-ఆపరేట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా గురువారం సహకారశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ద్వారా సింగిల్ విండో సొసైటీ చైర్మన్ చదువు రాంచంద్రారెడ్డి కో-ఆపరేటివ్ ఎక్సలెన్స్, మెరిట్ అవార్డు సొసైటీ సభ్యులతో కలిసి అందుకున్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ కామెడీ సంధ్యవెంకటరెడ్డి, సీఈవో కోలేటి శ్రీనివాస్, సంఘ సభ్యులు గాజనవేన సదయ్య ఉన్నారు.

పెద్దపల్లి రూరల్, జూలై 4 : మండలంలోని అప్పన్నపేట వ్యవసాయ సహకార సంఘం 2023లో అందించిన సేవలకు జాతీయ సహకార కో ఆపరేటివ్ అభివృద్ధి సంస్థ వారు రాష్ట్రస్థాయికి ఎంపిక చేయగా గురువారం అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లోని కోఆపరేటివ్ కార్యాలయంలో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా సింగిల్‌విండో చైర్మన్ చింత పండు సంపత్‌తోపాటు డైరెక్టర్లు అవార్డును అందుకున్నారు. అవార్డును అందుకున్న వారిలో డైరెక్టర్‌లు సోమ చంద్రయ్య, ఎల్లెంకి స్వామి, వెంకన్న ఉన్నారు.

వాటర్ డిస్పెన్సర్‌లను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దపల్లిటౌన్, జూలై 4: సీఎస్‌ఆర్ ద్వారా వసతిగృహాలకు వచ్చిన వాటర్ డిస్పెన్సర్‌లను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం కలెక్టర్ ప్రభుత్వ బీసీ కళాశాల బాలుర వసతి గృహాన్ని సందర్శించి యూనియన్ బ్యాంక్ సీఎస్‌ఆర్ నిధులతో స్పాన్సర్ చేసిన వాటర్ డిస్పెన్సర్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసి అభివృద్ధి అధికారి రంగారెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు

ధర్మారం, జూలై 4: పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత చెప్పారు. గురువారం మండలంలోని పత్తిపాక, బంజేరుపల్లి గ్రామాల్లో ముగ్గురికి డెంగ్యూ జ్వరం రావడంతో ఆమె ఇంటి పరిసరాలను పరిశీలించారు. డెంగ్యూ జ్వరాలు రాకుండా గ్రామాల్లో ఫాగింగ్, నీటి నిల్వల యందు ఆయిల్‌బాల్స్ వేయాలని సూచించారు. ఆమె వెంట మండల పంచాయతీ అధికారి రమేష్, కార్యదర్శులు, ఆశా వర్కర్‌లు ఉన్నారు.

ఎంపికైన విద్యార్థులు రిపోర్ట్ చేయాలి

- జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి ఏ.సురేష్

పెద్దపల్లిటౌన్, జూలై 4: రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు జూలై 7లోపు రిపోర్ట్ చేయాలని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి ఏ.సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఉన్న క్రీడా పాఠశాలలో ప్రవేశాల నిమిత్తం నిర్వహించనున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు జిల్లా నుంచి విద్యార్థులు ఎంపిక చేశామన్నారు. ఎలిగేడు మండలం ఎంపీపీఎస్ రాములపల్లికి చెందిన డి.రుద్రాంష్, ఎంపీపీఎస్ బసంత్‌నగర్‌కు చెందిన జి.హరీష్, రామగుండం పట్టణం శ్రీచైతన్య టెక్నో స్కూల్‌కు చెందిన కే శివానంద్, జూలపల్లి మండలం ఎంపీపీఎస్, పెద్దాపూర్‌కు చెందిన ఎస్‌డి అహ్మద్, మంథని మండలం ఎంపీపీఎస్‌కు చెందిన ఈ. విరాట్ అగస్త్య, శ్రీరాంపూర్ మండలం ఎంపీపీఎస్ ఉషన్నపల్లికి చెందిన జే. అభిజ్ఞ, ఓదెల మండలం వివేకానంద విద్యాలయయానికి చెందిన జి.తిరుమలలు ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు జూలై 7 మధ్యాహ్నం 3 గంటలవరకు తెలంగాణ ప్రభుత్వ క్రీడాపాఠశాల, హకీంపేట స్కూల్లో రిపోర్ట్ చేయాలని, వీరికి జులై 8న ఉదయం రాష్ట్ర స్థాయి పోటీలు ఉంటాయని, విద్యార్థులు తమ వెంట రెండు సెట్లు డాక్యుమెంట్స్ తీసుకురావాలని అక్కపాక సురేష్ పేర్కొన్నారు.

బొగ్గు బావుల వేలం పాటను నిలిపివేయాలి

పెద్దపల్లిటౌన్, జూలై 4: సింగరేణికి బొగ్గు గనులను కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సీపీఎం పెద్దపల్లి ఏరియా కార్యదర్శి రవిందర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రవిందర్ మాట్లాడుతూ అసెంబ్లీ తీర్మానం కూడా చేయాలని, సింగరేణి ప్రైవేటుపరం అయితే కార్మికులకు ఎలాంటి చట్టాలు గానీ, హక్కులు గానీ అమలుకావన్నారు. సింగరేణి పరిసర ప్రాంతాలు, ప్రజల జీవన విధానం కూడా నిర్వీర్యం అయ్యే ప్రమాదం ఉందన్నారు. నరేంద్ర మోదీ కేవలం తన జేబు సంస్థలుగా ఉన్న ఆదానీ, అంబానీలాంటి వారికి దేశ సంపదను దోచిపెట్టడమే మోదీ ప్రస్తుతం చేస్తున్న ప్రయత్నమన్నారు. ఇప్పటికే గడిచిన పదేళ్లలో దాదాపుగా బొగ్గు గనులు ప్రైవేటు వారికి అప్పచెప్పారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, సింగరేణికి బొగ్గు గనుల తవ్వకాలు అప్పచెప్పాలని లేనిపక్షంలో బొగ్గు గనుల వేలంకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలను, రాజకీయ పార్టీలను ఏకం చేసి భవిష్యత్తులో ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు ఆర్ల సందీప్, జిల్లాల ప్రశాంత్, ఎ సురేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి

- కనీస విద్యా ప్రమాణాలను పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ - గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి, తాగునీటికి ఇబ్బంది ఉండొద్దు
- అభివృద్ధి పనులకు భూ కేటాయింపులు పూర్తి చేయాలి.. - కలెక్టర్ కోయ శ్రీహర్ష


ఎక్లాస్‌పూర్ ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్

మంథని, జూలై 4:జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ప్రణాళికాబద్ధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. మంథని పట్టణంలోని, మండలంలోని ఎక్లాస్‌పూర్, గద్దలపల్లి, బిట్టుపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలను, పీహెచ్‌సీ, అంగన్‌వాడి కేంద్రాన్ని కలెక్టర్ గురువారం తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలోనీ తరగతి గదులను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థుల విద్యా ప్రమాణాలను స్వయంగా పరీక్షించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థుల కనీస విద్యా ప్రమాణాలపై ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలన్నారు. ఏక్లాస్‌పూర్‌లోని జడ్పీ హెచ్‌ఎస్‌లో గ్రౌండ్‌లో నీరు నిల్వ ఉండకుండా పనులు చేపట్టి పూర్తి చేయాలన్నారు. పాఠశాలలో పెండింగ్ పనుల వివరాలు, ప్రతిపాదనలు రూపొందించి సమర్పించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో గ్రామంలో గర్భిణులను 100 శాతం ఏఎన్‌సీ, రిజిస్ట్రేషన్ చేసి, రెగ్యులర్ పరీక్షలు చేయించుకునేలా చూడాలన్నారు. బిట్టుపల్లి అంగన్వాడీ కేంద్రానికి విద్యుత్ సరఫరా, లైట్లు,ఫ్యాన్ సౌకర్యం కల్పించాలన్నారు.

పారిశుధ్యంపై సమీక్ష..

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఎక్కడ ప్లాస్టిక్ కవర్లు కనిపించవద్దని కలెక్టర్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులతో పారిశుధ్య నిర్వహణ, వనమహోత్సవం కార్యక్రమం తదితర అంశాలపై గురువారం సమీక్షించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం పెంపొందించడంపైన ప్రధాన దృష్టి సారించాలన్నారు. గ్రామాలలో సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించేలా చూడాలన్నారు.

గ్రామాల్లో ప్రతిరోజు ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించి డంప్‌యార్డ్‌కు తరలించాలన్నారు. గ్రామాలలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలను రెగ్యులర్‌గా శుభ్రం చేయాలన్నారు. వన మహోత్సవం కార్యక్రమం కింద గ్రామాల్లో నాటాల్సిన మొక్కల లక్ష్యం ప్రకారం అవసరమైన మేర గుంతల తవ్వకం త్వరితగతిన పూర్తి చేయాలని, ఉపాధి హామీ కూలీలకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. మిషన్ భగీరథ సర్వే వివరాలపై ఆరా తీసి, తాగునీటి ఇబ్బందులు గ్రామాలలో రాకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా పాలన కౌంటర్‌ను పరిశీలించి ప్రతిరోజు వస్తున్న దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.మంథనిలో ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను ఆయన తనిఖీ చేసి ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్ళు, అంగన్వాడి కేంద్రాలకు బియ్యం సరఫరాపై ఆరా తీశారు.

భూ కేటాయింపులు పూర్తి చేయాలి

మంథని పట్టణంలో అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణ పూర్తిచేసి సంబంధిత శాఖలకు భూ కేటాయింపులు చేయాలని సూచించారు. పట్టణంలో వంద పడకల ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయం, వెజ్, నాన్ వెజ్ మార్కెట్, రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయ నిర్మాణాలకు అనువైన స్థలాలను ఎంపిక చేయాలన్నారు. గుంజపడుగు, సిరిపురం, అడవి సోమన్ పల్లి వద్ద బహుళ జాతి కంపెనీ కోకా కోలా ప్లాంట్ ఏర్పాటుకు అనువైన స్థలం భూసేకరణ వివరాలు, మంథని అసెంబ్లీ నియోజకవర్గానికి సమీకృత గురుకులాల విద్యా సంస్థల ఏర్పాటు కోసం అవసరమైన 25 ఎకరాల భూమినీ గుర్తించాలన్నారు. సుందిళ్ల బ్యారేజీ, పంప్ హౌజ్ వివరాలను ఆరా తీశారు. వరంగల్-మంచిర్యాల 4 లైన్ల గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ నిమిత్తం నిర్వాసితులకు జరుగుతున్న చెల్లింపుల పురోగతి వివరాలను అడిగితెలుసుకున్నారు. స్థానిక ప్రజల నిర్మాణ అవసరాలను తీర్చడానికి మండలంలోని విలోచవరం గోదావరినది తీరం నుంచి స్యాండ్ టాక్సీ విధాన్ని శుక్రవారం ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. స్యాండ్ ట్యాక్సీ వాహనాలతో మాత్రమే ఇసును రవాణా చేసుకోవాలని, ప్రైవేట్‌వాహనాల్లో ఇసుక రవాణా చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మాస్టర్ ప్లాన్‌పై మరోమారు అభిప్రాయ సేకరణ

- ప్రజల నుంచి అభ్యంతరాల స్వీకరణ

కోల్‌సిటీ, జూలై 4: రామగుండం సమగ్రాభివృద్ధికి రాబోయే 20 ఏళ్ల అవసరాలను ప్రతిబింబింపచేయాల్సిన మాస్టర్ ప్లాన్‌లో మళ్లీ కదలిక మొదలైంది. 2022లో గత ప్రభుత్వం హడావిడిగా మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల మాస్టర్ ప్లాన్‌లను రూపొందించగా రాష్ట్ర వ్యాప్తంగా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. హైకోర్టు సైతం తప్పుబట్టింది. ఈ పరిస్థితుల్లో మాస్టర్ ప్లాన్‌ల అమలును పెండింగ్‌లో పెట్టారు. రామగుండం నగరపాలక సంస్థకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ ముసాయిదాపై ప్రజలతో ఎలాంటి సమావేశాలు నిర్వహించకుండానే హడావిడిగా సిఫార్సు చేశారు. డీడీఎఫ్ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో రూపొందించిన ఈ ముసాయిదా పూర్తిగా లోపభూయిష్టంగా ఉందనే అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా సింగరేణి, ఎన్‌టీపీసీ, జెన్‌కో సంస్థలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. ఈ డ్రాఫ్టు రూపకల్పనలో కన్సల్టెంట్లకు, కార్పొరేషన్ ఇతర విభాగాలకు మధ్య సమన్వయం లోపించిందనే విమర్శలు వచ్చాయి. పారిశ్రామిక ప్రాంత భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్ ప్రతిపాదనలు లేవనే ఆరోపణలున్నాయి. నగర రోడ్లు, నాలాల నిర్మాణ ప్రతిపాదనలు, అభివృద్ధి ప్రాంత ఏర్పాటు, రెసిడెన్షియల్, కమర్షియల్ జోన్లు, బఫర్ జోన్లు, గ్రీన్ బెల్ట్‌లు, పార్కింగ్ జోన్‌లు, ప్లేగ్రౌండ్‌లు, పార్కులు, ఇండస్ట్రియల్ జోన్‌లు తదితర విషయాల్లో క్షేత్రస్థాయికి తగిన పరిస్థితులకు, మాస్టర్ ప్లాన్‌కు మధ్య భారీవ్యత్యాసాలు ఉన్నాయి. కార్పొరేషన్ పరిధిలోని స్థలాల్లో 80శాతం ఇండస్ట్రియల్ వినియోగంగా ఉందంటూ ప్రతిపాదనలు చేశారు. భవిష్యత్‌లో మైనింగ్ జరిగే ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి కోల్‌బేరింగ్ ఏరియాలుగా పేర్కొంటుంది.

సింగరేణి వద్ద కోల్ బేరింగ్ ఏరియాల సమాచారం కూడా ఉంది. వాస్తవానికి మైనింగ్ జరిగిన ఏరియాల్లో రెసిడెన్షియల్ జోన్‌లుగా గుర్తించేందుకు అవకాశం ఉండదు. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో మైనింగ్‌తో సంబంధం లేని ప్రాంతాలు, గ్రామాలను సైతం పారిశ్రామిక జోన్లుగా గుర్తించారు. ముఖ్యంగా పోతనకాలనీ, అల్లూరు, మారేడుపాక వంటి ప్రాంతాలు ఈ జోన్‌లో ఉన్నాయి.గ్రీన్‌బెల్ట్ రూపకల్పనలో కూడా వాస్తవ పరిస్థితులను విస్మరించారు. గంగానగర్‌లోని ఒక అనుమతి వెంచర్‌ను విస్మరించి దానిని రిక్రియేషన్ జోన్‌గా చూపారు. ఇలా చాలా లోటుపాట్లు ఉన్నాయి.

అమృత్ సాకుగా చూపి సిఫార్సు..

మాస్టర్ ప్లాన్‌కు అమృత్‌కు ఎలాంటి సంబంధం లేదు. కేవలం మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు అయ్యే ఖర్చును మాత్రమే అమృత్ నిధుల నుంచి వెచ్చించనున్నారు. మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్న డీడీఎఫ్ కన్సల్టెన్సీకి బిల్లులు అమృత్‌నిధులతో ఇస్తారు. ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ మాస్టర్ ప్లాన్ ఆమోదం తెలుపకపోతే అమృత్ నిధులు రావు అంటూ కౌన్సిల్‌ను యంత్రాంగం తప్పుదోవ పట్టించింది. మాస్టర్ ప్లాన్ ముసాయిదా కాపీ కూడా కౌన్సిల్‌లో ప్రదర్శించకుండానే చప్పట్లు కొట్టారు. దీంతో డ్రాఫ్టు ఆమోదానికి సిఫార్సు చేశారు. ఇప్పటికే పలువురు హైకోర్టులో వ్యాజ్యాలు దాఖలు చేశారు. మాస్టర్ ప్లాన్ అమలు నిలిపివేస్తున్నామని ప్రభుత్వం చెప్పడంతో పెండింగ్‌లో పడింది.

మళ్లీ ప్రజాభిప్రాయ సేకరణ..

రామగుండం మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో ఎక్కడా కూడా నిబంధనలు పాటించలేదు. మాస్టర్ ప్లాన్ ముసాయిదాకు సంబంధించి వ్యాపారులు, డాక్టర్లు, రియల్ ఎస్టేట్ సంస్థలు, నిర్మాణ రంగ సంస్థలు స్టేక్ హోల్డర్లతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించాల్సి ఉంటుంది. ఇలా రెండు మూడుసార్లు సమావేశం ఏర్పాటు చేసి ప్రజాభిప్రాయ సేకరణ జరపాలి. రామగుండంలో 2021 డిసెంబరు 28న కేవలం ఎన్‌టీపీసీ, సింగరేణి అధికారులతో స్టేక్ హోల్డర్ల సమావేశం నిర్వహించగా, పరిశ్రమలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. సుమారు వంద వరకు రాతపూర్వక అభ్యంతరాలు వచ్చాయి. ఈ పరిస్థితుల్లో మాస్టర్ ప్లాన్‌పై మరోమారు 60రోజుల గడువుతో అభ్యంతరాలు స్వీకరించనున్నారు.

ముగిసిన జిల్లా, మండల పరిషత్‌ల పాలక వర్గాల పదవీ కాలం

- జడ్పీ ప్రత్యేక అధికారిగా కలెక్టర్..
- మండల పరిషత్‌ల ప్రత్యేక అధికారులుగా జిల్లా అధికారులు

పెద్దపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండల, జిల్లా పరిషత్ పాలక వర్గాల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన మొదలయ్యింది. మండల పరిషత్ ఎంపీపీలు, ఎంపీటీసీల పదవీ కాలం ఈనెల 3వ తేదీ నాటితో ముగియగా, గురువారం నాటితో జిల్లా పరిషత్ చైర్మన్, జడ్పీటీసీ సభ్యుల పదవీ కాలం ముగిసింది. జడ్పీ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ శ్రీహర్ష వ్యవహరించనున్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. మండల పరిషత్‌లకు ప్రత్యేక అధికారులుగా జిల్లా స్థాయి అధికారులను నియమించడంతో వారు ఆయా మండలాల్లో ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు స్వీకరించారు. అంతర్గాం మండల ప్రత్యేక అధికారిగా జిల్లా సంక్షేమ అధికారి ఎండీ రవూఫ్ ఖాన్, ధర్మారం మండల ప్రత్యేక అధికారిగా డీఎస్‌వో ప్రేమ్‌కుమార్, ఎలిగేడు మండల ప్రత్యేక అధికారిగా జిల్లా మత్స్యశాఖాధికారి జె భాస్కర్, జూలపల్లి మండల ప్రత్యేక అధికారిగా డీఎంహెచ్‌వో డాక్టర్ రామస్వామి, కమాన్‌పూర్ మండల ప్రత్యేక అధికారిగా జిల్లా వ్యవసాయ శాఖాధికారి దోమ ఆదిరెడ్డి, మంథని మండల ప్రత్యేక అధికారిగా మంథని ఆర్‌డీవో వీ హనుమనాయక్‌ను నియమించారు. ముత్తారం మండల ప్రత్యేక అధికారిగా డీఆర్‌డీవో ఆర్ రవీందర్, ఓదెల మండల ప్రత్యేక అధికారిగా జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి పి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, పాలకుర్తి మండల ప్రత్యేక అధికారిగా జిల్లా అటవీశాఖాధికారి సీహెచ్ శివయ్య, పెద్దపల్లి మండల ప్రత్యేక అధికారిగా పెద్దపల్లి ఆర్‌డీవో బి గంగయ్య, రామగిరి మండల ప్రత్యేక అధికారిగా ఆర్‌ఎస్‌పీ లత, కాల్వశ్రీరాంపూర్ మండల ప్రత్యేక అధికారిగా జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి జాలి రంగారెడ్డి, సుల్తానాబాద్ మండల ప్రత్యేక అధికారిగా జిల్లా ఉద్యాన శాఖాధికారి సి జగన్‌మోహన్‌రెడ్డిని నియమించారు.

మానసిక వికలాంగుల పాఠశాలకు నిధులు ఇవ్వండి

● సీఎంను కలిసిన పాఠశాల ట్రస్టు చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

తిమ్మాపూర్, జూలై4: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక వికలాంగుల పాఠశాలకు ప్రభుత్వం నుంచి నిధులు ఇవ్వాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పాఠశాల ట్రస్టు చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి హైదారాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ పాఠశాలకు ప్రభుత్వ పక్షాన ప్రతి నెల 8లక్షల 30వేల నిధులు మంజూరు ఇప్పించాలని సీఎంను కోరారు. 2021లో గత ప్రభుత్వంలో పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేస్తామని చెప్పి మాట నిలుపుకోలేదని, కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి 52లక్షలకు ప్రతిపాదనలు పంపిస్తే కేవలం 16లక్షలు మాత్రమే విడుదల చేసిందని సిఎం దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. పాఠశాల సిబ్బంది జీతభత్యాలకు, హస్టల్ నిర్వహణకు డబ్బు లేకపోవడంతో సంక్లిష్ట పరిస్థితులలో పాఠశాల నడుస్తున్నదని పాఠశాల నిర్వహణకు ప్రతి నెల 8లక్షల 30వేల రూపాయలు ఖర్చు అవుతుందని తెలిపారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం మానసిక వికాలంగుల పాఠశాలపై



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన చాడ వెంకట్‌రెడ్డి

ప్రత్యేక దృష్టి పెట్టి సంవత్సరానికి కోటి రూపాయల ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విన్నవించినట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి కూడా దానికి సానుకులంగా స్పదించినట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తూ యువకులకు గాయాలు

సైదాపూర్, జూలై 4: సైదాపూర్ మండలంలోని రాయికల్ వాటర్‌ఫాల్స్ వీక్షించేందుకు వచ్చిన ఇద్దరు యువకులు ప్రమాదవశాత్తూ గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన సంపత్, మన్నెంపల్లికి చెందిన శ్రీనివాస్ అనే యువకులు రాయికల్ వాటర్‌ఫాల్స్ అందాలు చూసేందుకు గురువారం వచ్చారు. వాటర్ ఫాల్స్ వద్ద తేనటీగలు వారిపై దాడి చేశాయి. దాంతో ఆ యువకులు తేనెటీగల నుంచి తప్పించుకునేందుకు పరుగులు తీయగా జారిపడడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు, స్థానికులు ఆ యువకులను 108 వహనంలో ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

సుల్తానాబాద్, జూలై 4: మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన ఎలవేణి మల్లయ్య(54) చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కుటుంబ తగాదాల కారణంగా జీవితంపై విరక్తి చెంది బుధవారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా గురువారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు లేని పాఠశాలలో ఆరుగురు ఉపాధ్యాయులు

● పాఠశాలను సందర్శించిన జడ్పీటీసీ కుమార్

చందుర్తి, జూలై 4 : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు కృషి చేస్తుండగా మండలంలోని కిష్టంపేట గ్రామంలో ఇందుకు విరుద్ధంగా విద్యా వ్యవస్థ కొనసాగుతుందని జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్ అన్నారు. మండలంలోని కిష్టంపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఉదయం జడ్పీటీసీ సభ్యుడు కుమార్ సందర్శించారు. పాఠశాలను సందర్శించిన సమయంలో విద్యార్థుల సంఖ్య జీరో ఉండగా, ఆరుగురు ఉపాధ్యాయులకు గాను ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే హాజరయ్యారు. విద్యార్థులు లేకపోవడంతో వంతుల వారీగా ఉపాధ్యాయులు విధులకు హాజరవుతున్నట్లు ఆయన దృష్టికి వచ్చింది. ప్రధానోపాధ్యాయునితో పాటు మరో ముగ్గురు ఉపాధ్యాయులు విధులకు డుమ్మా కొట్టడంతో జడ్పీటీసీ అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులు లేకపోవడంతో ప్రతిరోజు ఉపాధ్యాయులు పాఠశాలలో కాలక్షేపం చేస్తున్నట్లు తనిఖీలో వెల్లడయింది. కొన్ని పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువ ఉండగా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితులు ఉన్నాయి. కిష్టంపేట



పాఠశాల పరిస్థితిపై డీఈవో ఫోన్‌లో మాట్లాడుతున్న జడ్పీటీసీ

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను చూస్తే ఉపాధ్యాయ పనితీరు ఏ విధంగా ఉందో అర్థమవుతుందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు లేని పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించడంతో లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని, ఉపాధ్యాయులను ఇతర పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపాలని జడ్పిటిసి సభ్యుడు కుమార్ జిల్లా విద్యాధికారికి ఫోన్‌లో మాట్లాడి కోరారు.

బొగ్గు బ్లాకుల వేలాన్ని నిలిపివేయాలి



కరపత్రం విడుదల చేస్తున్న ట్రేడ్‌యూనియన్ నాయకులు

భగత్‌నగర్, జూలై 4: సింగరేణి బ్లాకుల వేలాన్ని నిలిపివేయాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆల్ ట్రేడ్‌యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఆల్‌ట్రేడ్ యూనియన్ నాయకుల సమావేశం నిర్వహించి, కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి, సిఐటియు, ఐఎఫ్‌టియు, టిఎన్‌టియుసి నాయకులు టేకుమల్ల సమ్మయ్య, ఎడ్ల రమేష్, జిందం ప్రసాద్, కళ్యాడపు ఆగయ్య, కె బుచ్చయ్య యాదవ్, లక్ష్మణ్, కూరపాటి రమేష్, ముకుందరెడ్డి, యు శ్రీనివాస్, ప్రభ, స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

● భగత్‌నగర్ : బీజేపీ ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రైవేట్ సంస్థలకు మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకులను వేలం వేస్తున్నదని, సింగరేణి సంస్థను ప్రైవేట్‌సంస్థలతో వేలం పాటలో పోటీ పడాలని నిర్ణయించడం సిగ్గుచేటన్నారు. దేశభక్తి పేరుతో దేశసంపదను ప్రైవేట్ పరం చేస్తున్న బీజేపీవిధానాలను ప్రజానీకం గుర్తించి తగిన బుద్ధి చెప్పాలన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేత?

చందుర్తి, జూలై 4 : చందుర్తి మండలం మూడపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడిని గంజాయి విక్రయిస్తున్నాడని పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అరుణ్ అనే యువకుడు హైదరాబాద్‌లో రూమ్‌మేట్ వద్ద నుంచి గంజాయి తీసుకువచ్చి గ్రామంలో విక్రయిస్తున్నాడన్న అనుమానంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు.

గురుకుల పనివేళలను సమీక్షించాలి

జగిత్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యా సంస్థలకు నిర్ణయించిన పనివేళల్లో శాస్త్రీయత లోపించిందని, విద్యార్థులుకుపై మానసిక ఒత్తిని పెంచే విదంగా ఉందని, వాటిని వెంటనే పునః సమీక్షించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిరుక్కోవెల శ్యామ్‌సుందర్, అంబటి భూమేశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. గత ప్రభుత్వం లెక్కకు మిక్కిలి గురుకులాలను ప్రారంభించి అరకొర సౌకర్యాలున్న అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న సందర్భంలో ప్రస్తుత పనివేళలు సమర్థనీయంగా లేవన్నారు. విద్యార్థులు మూడు గంటల పాటు ఏకబిగిన అసౌకర్యమైన తరగతి గదుల్లో కూర్చోవటం, ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 1.45 వరకు భోజనం చేయకుండా ఉండడం ఎలా సాధ్యమవుతుందో అర్థం కావడం లేదన్నారు. ఉపాధ్యాయులకు స్టాఫ్‌క్వార్టర్స్ లేకుండా ఊరికి దూరంగా విద్యా సంస్థలు ఉన్న సందర్భంలో ఉదయం పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు రాత్రి 9 గంటల వరకు అక్కడే ఉండాల్సిన దుస్థితి నెలకొంటుందన్నారు. ప్రభుత్వ సెలవులు, పండుగ సెలవుల్లో కూడా పనిచేయాల్సిన సందర్భంలో ఉపాధ్యాయులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతారని ఆందోళన వ్యక్తం చేశారు.

బ్యాటరీల దొంగను పట్టుకున్న స్థానికులు

ఎల్లారెడ్డిపేట, జూలై 4: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి బస్టాండులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై వాహనాల బ్యాటరీల దొంగను స్థానికులు గురువారం పట్టుకున్నారు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. గొల్లపల్లిలో కొంత కాలంగా ఆరుబయట నిలిపి ఉంచిన ఆటోలు, బైకులు, ట్రాలీ ఆటోలు, ట్రాక్టర్లకు సంబంధించిన బ్యాటరీలు చోరీకి గురవుతున్నాయి. గురువారం గొల్లపల్లి బస్టాండ్ ప్రాంతంలో నిలిపి ఉన్న ట్రాలీ ఆటో బ్యాటరీని చోరీ చేస్తుండగా స్థానికులు గమనించి పట్టుకున్నారు. అదే వాహనంలో చోరీకి పాల్పడిన వ్యక్తిని తాళ్లతో చేతులను కట్టేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఆరుగురు ఓ ముఠాగా ఏర్పడి బ్యాటరీలతో పాటు ద్విచక్ర వాహనాలను దొంగలిస్తున్నారని గుర్తించారు. ముఠాలో ఇద్దరు మహిళలున్నారని తేలింది.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

- ప్రాజెక్టులోకి 2,894 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. గురువారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టులోకి 2,894 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 90.323 సామర్థ్యంకు గానూ ప్రస్తుతం 11.335 టీఎంసీల నీరు నిల్వఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 16.126 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 479 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇదిలా ఉండగా జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 5.190 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

జైనాలో వైభవంగా పోచమ్మ బోనాలు

ధర్మపురి, జూలై 4: ధర్మపురి మండలంలోని జైనా గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నెత్తి మీద బోనాలు పెట్టుకుని డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా సమీపంలో గల ఆలయానికి వెళ్లారు. అనంతరం మహిళలు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మహిళలు అమ్మవారలకు పసుపు, కుంకుమ చల్లి, బోనాలు పెట్టి నైవేద్యం సమర్పించారు. కుటుంబసభ్యులు క్షేమంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో జైనా రజక సంఘం అధ్యక్షులు సంగెపు గంగారం, గౌరవ అధ్యక్షులు సంగెపు మల్లయ్య, సభ్యులు లచ్చయ్య, వెంకటి, గంగారాం, బుచ్చయ్య, మల్లయ్య శ్రీనివాస్, ప్రదీప్, అజయ్, సతీష్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



జైనా రజక సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు

విద్యుత్‌చౌర్యం కేసులో ఒకరికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, జూలై 4 : ఎలాంటి అనుమతి లేకుండా విద్యుత్‌ను చౌర్యం చేసిన కేసులో హుజురాబాద్ మండలం బోర్నపల్లికి చెందిన కేశబోయిన తిరుపతికి ఒక నెల రోజుల సాధారణ జైలు శిక్ష లేదా 14,616 రూపాయల జరిమానానాను విధిస్తూ కరీంనగర్ జిల్లా 1వ అదనపు సెషన్స్ జడ్జి డి వెంకటేష్ గురువారం తీర్పు ఇచ్చారని కరీంనగర్ ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ ఎండీ షాదుల్లా బాబా తెలిపారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌కో విజిలెన్స్ హెడ్‌కానిస్టేబుల్ ఇంతియాజ్ మహ్మద్‌ఖాన్, బి రాజయ్యలున్నారు.

రూ.7,500 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూలై 4: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,500 పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు తొమ్మిది మంది రైతులు 181క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7500, కనిష్ఠ ధర రూ.7200 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

గంజాయి ముఠా గుట్టు రట్టు చేసిన పోలీసులు

- 2 కిలోల 70 గ్రాముల గంజాయి పట్టివేత
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘుచందర్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

ధర్మపురి, జూలై 4: జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణ శివారులో గల హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద గంజాయి విక్రయించేందుకు వెళ్తున్న బత్తిని చందు (23), గోల్ల వెంకటేష్ (25) పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశానుసారంగా ధర్మపురి పోలీస్ సర్కిల్ కార్యాలయంలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్ట్ వివరాలు వెల్లడించారు. ధర్మపురి మండలంలోని రాయపట్నం గ్రామానికి చెందిన నిందితులు చందు, వెంకటేష్ గంజాయి తాగుటకు బానిసగా మారారు. వారికి ఖర్చులకు డబ్బులు లేక గంజాయి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇక్కడకు తీసుక వచ్చి తాగిన తర్వాత మిగిలిన గంజాయి ఎక్కువ ధరకు విక్రయించాలని నిర్ణయించినట్లు తెలిపారు. గంజాయి ఎక్కడ దొరుకుతుందో తెలుసుకుని వారి స్నేహితుడు రాము అనే వ్యక్తి వద్ద రెండు నెలల క్రితం కొనుగోలు చేసి చుట్టు పక్కల గ్రామాల్లో ఎక్కువ ధరకు విక్రయించాలని నిందితులు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. బత్తిని చందు తన మోటార్‌సైకిల్ సీటు కింద పెట్టుకోగా, గోల్ల వెంకటేష్ తన మోటార్ సైకిల్ పెట్రోల్ ట్యాంకర్ కవర్లో గంజాయి పెట్టుకుని ధర్మపురి వైపు వెళ్తున్నట్లు తెలిపారు. హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్దకు రాగానే సాయంత్రం వేళలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ ఉదయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుల వద్ద 2 కిలోల 70 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. గంజాయి విలువ రూ 40,000 వరకు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కేసుతో సంబంధం కలిగి ఉన్న రాము అనే నిందితుడు పరారీలో ఉన్నట్లు వివరించారు. నిందితులను పట్టుకుని గంజాయి సీజ్ చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన డీఎస్పీ రఘుచందర్, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ధర్మపురి ఎస్ఐ ఉదయ్‌కుమార్, ఏఎస్ఐ సూర్యనారాయణరాజు, హెడ్‌కానిస్టేబుల్స్ శంకర్, వెంకటయ్య, రామస్వామి, కానిస్టేబుల్ రమేష్, నవీన్‌కుమార్, రమేష్‌నాయక్, సిబ్బందిని జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐలు ఉదయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, ఉమాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

జమ్మికుంట రూరల్, జూలై 5: జమ్మికుంట మండలం కాపులపల్లి గ్రామానికి చెందిన భైరెడ్డి రాంరెడ్డి (83) అనారోగ్యంతో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జమ్మికుంట పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరు నెలల నుంచి రాంరెడ్డి పక్షవాతంతో బాధపడ్డాడు. బీపీ, షుగర్ లెవల్స్ పెరిగి ఇరువై రోజుల క్రితం కళ్లు తిరిగి కిందపడ్డాడు. అనారోగ్యం వల్ల తీవ్ర మనస్థాపానికి గురైన రాంరెడ్డి ఇంట్లో నుంచి జమ్మికుంటకు వచ్చి గడ్డి మందు కొనుక్కుని పాత వ్యవసాయ మార్కెట్లో తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు సమ్మిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

భర్త వేధింపులు భరించలేక ఆత్మహత్య

జమ్మికుంట, జూలై 4: భర్త వేధింపులు తాళలేక భార్య ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జమ్మికుంటలో గురువారం చోటు చేసుకుంది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. వీణవంక మండలం వల్బాపూర్ గ్రామానికి చెందిన మారుముళ్ల పద్మ, లక్ష్మయ్య దంపతుల కుమార్తె కావ్య (28)ను ఎల్బాక గ్రామానికి చెందిన జీడి రాజు అనే వ్యక్తికి ఇచ్చి 12ఏళ్ల క్రితం వివాహం జరిపించారు. మూడు సంవత్సరాలుగా దంపతులు ఇద్దరు పట్టణంలోని మారుతినగర్‌లో నివాసం ఉంటున్నారు. కావ్య ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతోందని అనుమానం పెంచుకున్న భర్త రాజు ఆమెను కొట్టడం మొదలు పెట్టాడు. వేధింపులు ఎక్కువ కావడంతో తీవ్ర మనస్థాపానికి గురైన కావ్య ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వరంగంటి రవి తెలిపారు.

పీఏసీఎస్ రాయికల్‌కు ఎక్సలెన్స్, మెరిట్ అవార్డు


అవార్డు అందుకుంటున్న సహకార సంఘ సభ్యులు

రాయికల్, జూలై 4: రాయికల్ వ్యవసాయ సహకార సంఘానికి గురువారం ఎక్సలెన్స్ మెరిట్ అవార్డు లభించింది. నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంతీయ కో ఆపరేటివ్ ఎక్సలెన్స్, మెరిట్-2023 అవార్డులో భాగంగా పీఏసీఎస్ రాయికల్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, వైస్ చైర్మన్ బేతి మోహన్‌రెడ్డి, సీఈవో రవికుమార్, సిబ్బంది తెలంగాణ రాష్ట్రంలోనే ఉత్తమ ప్రైమరీ కో ఆపరేటివ్ సొసైటీ అవార్డు అందుకున్నారు. ఈ అవార్డుతో పాటు రూ.20 వేల ప్రోత్సాహక బహుమతి కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌సీఏబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, టీఎస్‌సీఏబీ ఎండీ బి.గోపి, ఎన్‌సీడీసీ రీజనల్ డైరెక్టర్ వంశీ, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

● రాయికల్ : రాయికల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎక్సలెన్స్, మెరిట్ అవార్డును సాధించడం పట్ల జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ గురువారం సంఘం సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సంఘం సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, వైస్ చైర్మన్ బేతి మోహన్ రెడ్డి, సీఈవో రవి కుమార్ పాల్గొన్నారు.

రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయీస్ అధికారుల తనిఖీ


కోరుట్ల మిల్లులో సివిల్ సప్లయ్ అధికారులు


రంగాపూర్ రైస్ మిల్లులో తనిఖీలు చేస్తున్న అధికారులు

జగిత్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయీస్ అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. రాష్ట్ర సివిల్ సప్లయ్ శాఖ కమిషనర్ చౌహాన్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇతర జిల్లాలకు చెందిన సివిల్ సప్లయ్ అధికారులు, ఎన్‌ఫోర్స్ బృందాలు రైస్‌మిల్లుల్లో గురువారం దాడులు నిర్వహించారు. ప్రభుత్వం రైస్ మిల్లులకు సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యం నిల్వలు సరిగా ఉన్నాయా, లేవా అన్న అంశంపై అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని అయిదు చోట్ల సోదాలు జరిగాయి. జిల్లాలోని తక్కలపల్లిలో గల వేణు ఇండస్ట్రీస్, మాదాపూర్‌లోని విఘ్నేశ్వర్ రైస్ మిల్, కోరుట్ల పట్టణంలోని కొత్త సురేశ్ రైస్ మిల్లు, మేడిపల్లిలోని వాసుదేవ రైస్ మిల్, పెగ్గెర్ల సాయి గణేస్ ట్రేడర్స్ రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయీస్ అధికారులు సోదాలు నిర్వహించారు. రైస్‌మిల్లుల్లో గల ధాన్యం నిల్వల ఫిజికల్ వెరిఫికేషన్ జరిపారు. తనిఖీల్లో గుర్తించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు జిల్లా సివిల్ సప్లయి అధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో పెద్దపల్లి డీఎస్‌వో ప్రేమ్‌కుమార్, డీఎం శ్రీకాంత్, సిరిసిల్ల డీఎస్‌వో జితేందర్ రెడ్డి, డీఎం జితేందర్ ప్రసాద్, నిర్మల్ డీఎం నందిని, పలు మండలాల తహసీల్దార్లు, సీఐలు, ఎస్ఐలు, సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్లు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రైస్ మిల్లుల్లో సివిల్ సప్లయి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, డీఎస్‌టీలు, డీఎంలు సోదాలు నిర్వహించడం వ్యాపార వర్గాల్లో కలకలం రేపింది.

వెంకటయ్య కళ్లు సజీవం


వెంకటయ్య (ఫైల్)

జమ్మికుంట రూరల్, జూలై 4: జమ్మికుంట పట్టణానికి చెందిన చిదురాల వెంకటయ్య (92) బుధవారం రాత్రి అనారోగ్యంతో మృత్యువాత పడ్డాడు. సదాశయ ఫౌండేషన్ నిర్వాహకులు నేత్రదానంపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించగా వారు ముందుకు వచ్చారు. దీంతో వరంగల్ ఎల్‌విపి టెక్నీషియన్ సహకారంతో నేత్రాలు సేకరించి హైదరాబాద్‌లోని ఐ బ్యాంక్‌కు పంపించారు.

పెద్దమ్మ ఆలయంలో దొంగతనం

కొడిమ్యాల, జూలై 4: మండలంలోని తిప్పయ్యపల్లి గ్రామంలోని పెద్దమ్మ ఆలయంలో దొంగతనం జరిగిందని కొలకాని నర్సయ్య గురువారం మధ్యాహ్నం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 1 నుంచి 4 తేదీ ఉదయం వరకు గుర్తు తెలియని వ్యక్తులు పెద్దమ్మ ఆలయం తలుపులు పగుల గొట్టి సుమారు 15 వేల 500 రూపాయల విలువైన బంగారు ఆభరణాలు ఎత్తుకు పోయినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆదాయ పన్నుపై అవగాహన అవసరం

- హరి అశోక్‌కుమార్


కార్యక్రమంలో మాట్లాడుతున్న హరి అశోక్ కుమార్

జగిత్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆదాయ పన్నుపై అవగాహన అవసరమని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో పెన్షనర్స్‌తో ఆదాయపన్ను అంశంపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐటీ రిటర్న్‌లు ఫైల్ చేస్తే కలిగే ప్రయోజనాలను తెలుసుకోవాల్సిన అవసరముందన్నారు. రుణం కోసం గానీ, వీసా కోసం గానీ దరఖాస్తు చేసుకునే సమయాల్లో పన్ను రిటర్నులు ఉపయోగపడుతాయన్నారు. బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు ఇచ్చే రుణాల కోసం పన్ను రిటర్న్ రుజువు సమర్పించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా సహాయ అధ్యక్షుడు హన్మంతరెడ్డి, ప్రధాన కార్యదర్శి బొల్లం విజయ్, నాయకులు ప్రకాశ్ రావు, దిండిగల విఠల్, ఎండీ యాకూబ్, సత్యనారాయణ, శివానందం తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై యువకుడి అత్మహత్య

వీణవంక,జూలై04:మండలంలోని నర్సింగాపూర్ గ్రామనికి చెందిన దాసారపు ప్రశాంత్ (29) మద్యానికి బానిసై అత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం ప్రశాంత్ ఆరు నెలలుగా మద్యానికి అలువాటై జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని అత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతుడి అన్న వినోద్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

కోనరావుపేట, జూలై 4 : అప్పుల బాధతో సావనపెల్లి స్వామి (37) అనే వ్యక్తి గురువారం తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ధర్మారం గ్రామానికి చెందిన సావనపెల్లి స్వామి అనే వ్యక్తి తమకు 5 ఎకరాల భూమి ఉండగా అప్పుల బాధతో అటు భూమిని అమ్మి వేశారు. మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. అయినప్పటికీ వ్యవసాయంలో రాబడి రాక అప్పుల పాలయ్యాయి. అంతే కాకుండా భార్య లాస్య గుండె సంబంధించిన శస్త్ర చికిత్స కోసం కూడా అప్పులు చేశాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్థాపానికి గురై బుధవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని కోనరావుపేట ఎస్సై అంజనేయులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు గల కారణం పరిశీలించి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసినట్టు తెలిపారు. మృతునికి తల్లి మైసవ్వ, భార్య లాస్య, కుమారుడు శ్రీహన్ ఉన్నారు.

ఒమన్‌లో బొమ్మెన వాసి మృతి


సత్యనారాయణ(ఫైల్)

కథలాపూర్, జూలై 4 : మండలంలోని బొమ్మెనకు చెందిన పంజాల సత్యనారాయణ (54) అనే గల్ఫ్ వలసజీవి బుధవారం రాత్రి ఓమన్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం...సత్యనారాయణ రెండు సంవత్సరాల కిందట ఉపాధి నిమిత్తం ఒమన్ వెళ్లాడు. భవన నిర్మాణ కంపెనీలో కూలీగా పని చేస్తున్న సత్యనారాయణ డ్యూటీ ముగించుకుని గదికి వచ్చాడు. అప్పటి దాకా గదిలో ఉన్న సహచరులతో మాట్లాడిన సత్యనారాయణ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. మృతునికి భార్య, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. మరణవార్త విన్న కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాన్ని స్వగ్రామానికి తొందరగా పంపించే ఏర్పాట్లు చేయాలని, మృతుని కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందించాలని ప్రజాప్రతినిధులు కోరారు.

వ్యవసాయ బావుల మోటారు దొంగల అరెస్టు

ఇల్లంతకుంట, జూలై 4: మండలంలోని తాళ్లపెల్లి గ్రామానికి చెందిన నాంపెల్లి కనుకయ్య అనే రైతుకు చెందిన వ్యవసాయ మోటారును దొంగిలించిన వారిని పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం గురువారం తాళ్లపల్లి గ్రామ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వడ్డూరు గ్రామానికి చెందిన బిగుళ్ళ శ్రావణ్, ముత్తన్నపేట గ్రామానికి చెందిన కనగాండ్ల అజయ్‌ను పట్టుకొని విచారించగా వ్యవసాయ మోటార్‌ను అపహరించి గుండ్లపల్లి గ్రామానికి చెందిన వనరాసి కొమురయ్యకు అమ్మినట్లు అంగీకరించారు. వీరి వద్ద నుండి వ్యవసాయ మోటార్‌తో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

శంకరపట్నం, జూలై 4: శంకరపట్నం మండలం వంకాయగూడెం గ్రామంలో టాస్క్‌ఫోర్స్, కేశవపట్నం పోలీసులు గురువారం 40క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. వంకాయగూడెం గ్రామానికి చెందిన ధరావత్ శ్రీను, దీరావత్ హరాలాల్, ధనావత్ శ్రీను ఇళ్లలో నిల్వ చేసిన 40క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

ధాన్యం కమీషన్ డబ్బుల కింద ఫర్టిలైజర్

- డీసీఎంఎస్‌లో ఎరువుల అక్రమ అమ్మకాలపై ఏసీబీ విచారణ
- లక్ష రూపాయల లంచంతో పట్టుబడిన మేనేజర్, క్యాషియర్


ఏసీబీకి పట్టుబడ్డ జూనియర్ అసిస్టెంట్ కుమారస్వామి, మేనేజర్ వేంకటేశ్వర్‌రావు

కరీంనగర్ క్రైం, జూలై 4: జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లో ధాన్యం కొనుగోలు, ఫర్టిలైజర్ అమ్మకాలపై ఏసీబీ పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు. వరి, మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా డీసీఎంఎస్‌కు వచ్చిన కమీషన్ డబ్బులో 50 శాతం కేంద్రాల నిర్వహణ కాంట్రాక్టర్‌కు బిల్లు చెక్ రూపంలో చెల్లించాల్సి ఉంది. కానీ అందుకు విరుద్ధంగా ఫర్టిలైజర్‌ను డీసీఎంఎస్ మేనేజర్ రేగులపాటి వెంకటేశ్వర్ రావు బలవంతంగా కాంట్రాక్టర్ కావటి రాజుకు అంటగట్టి అక్రమాలకు పాల్పడ్డట్లు ఏసీబీ అధికారుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఫర్టిలైజర్ ఇచ్చేందుకు లైసెన్స్ కలిగి ఉండాలని, కాంట్రాక్టర్ చేత బలవంతంగా వ్యవసాయశాఖ నుంచి అతడి ఊరిలో ఫర్టిలైజర్ దుకాణం నిర్వహణకు లైసెన్స్ తీయించిన తరువాత ఫర్టిలైజర్‌ను ఇచ్చినట్లు బాధిత కాంట్రాక్టర్ తెలిపారు. కరీంనగర్ డీసీఎంఎస్ మేనేజర్ రేగులపాటి వెంకటేశ్వర్‌రావు, క్యాషియర్ సుదగోని కుమారస్వామిలు డీసీఎంఎస్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ కాంట్రాక్టర్ వాకటి రాజు వద్ద లక్ష రూపాయలు లంచం తీసుకుంటుండగా గురువారం ఏసీబీ పోలీసులు అరెస్టు చేశారు. 2018-19 సీజన్ నుంచి 2023-24 సీజన్ వరకు ధాన్యం కమీషన్ డబ్బులు మొత్తం 90 లక్షల 16 వేల 652 రూపాయలు కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సి ఉంది. ఈ డబ్బులు(పెండింగ్ బిల్లులు) కోసం కాంట్రాక్టర్ తిరిగి వేసారిపోయాడు. కాంట్రాక్టర్‌కు చెక్ రూపంలో చెల్లించాల్సిన డీసీఎంఎస్ మేనేజర్ నిబంధనలకు విరుద్ధంగా అతడికి 20 లక్షల 91 వేల 500 రూపాయల విలువ కలిగిన ఫర్టిలైజర్‌ను ఇచ్చాడు. మరో 69 లక్షల 25 వేల 152 రూపాయల ఫర్టిలైజర్‌ను కమీషన్ డబ్బుల కింద ముట్టజెప్పేందుకు ఒప్పందం కుదరగా ఇందుకు లంచంగా 15 లక్షల రూపాయలు మేనేజర్‌కు కాంట్రాక్టర్ ఇవ్వాలని ఒప్పందం కుదిరింది. ఈ సమయంలోనే మొదటి లక్ష రూపాయలు తీసుకుంటున్న క్రమంలో మేనేజర్, క్యాషియర్‌లను ఏసీబీ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కాగా ఏసీబీకి పట్టుబడిన డీసీఎంఎస్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావు ఆగస్టు నెలలో పదవీ విరమణ చేయనున్నారు. తనకు రావాల్సిన కమీషన్ బిల్లు కోసం 5 సంవత్సరాల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నానని, అప్పులు తెచ్చి ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించానని బాధితుడు కావటి రాజు తెలిపారు. తన కమీషన్ డబ్బులు డీసీఎంఎస్‌కు వచ్చినప్పటికీ చెక్ ఇవ్వకుండా లంచం డబ్బుల కోసం తనకు ఫర్టిలైజర్‌ను అంటగట్టారని వాపోయాడు. ఫర్టిలైజర్ బస్తాకు 15 రూపాయలు అదనంగా లెక్కగట్టారని, తన ఊరికి అదనంగా మరో 15 రూపాయల రవాణా చార్జి అయిందని, ఈ విధంగా బస్తాకు 30 రూపాయల వరకు నష్టం వాటిల్లిందని అతడు వాపోయాడు.

● కరీంనగర్ రీజియన్ ఏసీబీ డీఎస్పీ వి.రమణమూర్తి, బాధితుడు కావటి రాజు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణను ప్రైవేట్ వ్యక్తి అయిన పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన కావటి రాజు అనే కాంట్రాక్టర్ నిర్వహిస్తున్నాడు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ ద్వారా డీసీఎంఎస్‌కు క్వింటాల్ ధాన్యానికి 32 రూపాయల కమీషన్ వస్తుండగా అందులో నుంచి 50 శాతం అనగా 16 రూపాయలు కేంద్రాల నిర్వహణ కాంట్రాక్టర్ కావటి రాజుకు చెల్లించాలని ఒప్పందం ఉంది. దీని ప్రకారం 2018 నుంచి 2023 వరకు వరి, మొక్కజొన్న ధాన్యం సేకరణపై కాంట్రాక్టర్ రాజుకు మొత్తం 90 లక్షల 16 వేల 652 రూపాయలు రావాల్సి ఉంది. కాంట్రాక్టర్ రాజుకు డబ్బులు ఇవ్వాలంటే లంచం కోసం డీసీఎంఎస్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావు వేధిస్తున్నాడు. దీంతో విసిగిపోయిన కాంట్రాక్టర్ రాజు ఏసీబీని ఆశ్రయించాడు. లంచం డబ్బులు తీసుకుంటూ పట్టుబడిన మేనేజర్ వెంకటేశ్వర్‌రావు, క్యాషియర్ కుమారస్వామిలను అరెస్టు చేశామని, శుక్రవారం కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు.


మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి , బాధితుడు రాజుయాదవ్

ప్రయాణికులను బెదిరించిన యువకుల పట్టివేత


బస్టాండ్‌లో ఆర్టీసీ సెక్యూరిటీ అదుపులో ఉన్న పాత నేరస్థులు

కరీంనగర్ క్రైం, జూలై 4: కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులను బెదిరింపులకు గురి చేస్తూ దాడులకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను ఆర్టీసీ సెక్యూరిటీ పోలీసులు గురువారం పట్టుకున్నారు. పట్టుబడిన ఇద్దరు యువకులు పాత నేరస్థులు, గంజాయి సేవించేవారని ఆర్టీసీ సెక్యూరిటీ పోలీసులు తెలిపారు. పట్టుకున్న ఇద్దరిని ఒకటో టౌన్ పోలీసులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ రమణ, ఎం.సాగర్, సెక్యూరిటీ కానిస్టేబుల్ కవిత, నవీన్ పాల్గొన్నారు.

నేతన్నలు ఆత్మహత్యలు చేసుకోవద్దు

- సీపీఎం కేంద్ర కమిటీ పోలీట్ బ్యూరో సభ్యుడు చెరుపల్లి సీతారాములు


ఆత్మహత్య చేసుకున్న కుటుంబాన్ని పరామర్శిస్తున్న సీతారాములు

సిరిసిల్ల రూరల్, జూలై 4: నేతన్నలు ఉపాధి లేదంటూ ధైర్యం కోల్పోయి ఆత్మహత్యలు చేసుకుని కుటుంబాలను రోడ్డున పడేయవద్దని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నేతన్నల జీవితాలతో రాజకీయం చేయకుండా వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి కార్మికులకు ఉపాధి కల్పించాలని మాజీ ఎమ్మెల్సీ, సీపీఎం కేంద్ర కమిటీ పోలీట్ బ్యూరో సభ్యులు చెరుపల్లి సీతారాములు కోరారు. సిరిసిల్ల పట్టణంలో గురువారం సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మూషం రమేష్, కూరపాటి రమేష్‌లతో కలిసి ఇటీవల ఆత్మహత్య చేసుకున్న నేతన్న కుటుంబాలను పరామర్శించారు. వారికి సీపీఎం పార్టీ అండగా ఉంటుందని ప్రభుత్వం వారిని ఆదుకునేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తామని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. చేనేత జౌళి శాఖ కార్యాలయం వద్ద జరిగిన కార్మికుల సమావేశంలో కార్మికులతో మాట్లాడారు. ఆత్మహత్యలు చేసుకోవద్దని పోరాటాల ద్వారానే అన్ని సాధించుకుంటామని అన్నారు. అనంతరం చేనేత జౌళి శాఖ ఏడీ మిట్టకోల సాగర్‌ను కలిసి కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులో నిర్మిస్తున్న అపెరల్ పార్కులో వర్కర్ టు ఓనర్ షెడ్లను పరిశీలించారు. అనంతరం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ప్రధానంగా నాలుగు సమస్యల వలన పూర్తిగా సంక్షోభంలోకి కూరుకపోయి మొత్తం పరిశ్రమలు మూతపడ్డాయని అన్నారు. ప్రధాన సమస్యలు బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్లు ప్రభుత్వం రద్దు చేయడంతో పాటు కరెంటు సబ్సిడీ తొలగించడం, మార్కెట్‌లో ప్రస్తుతం తయారు చేసే వస్త్రానికి డిమాండ్ లేకపోవడంతో పాటు పాత బకాయిలు విడుదల చేయకపోవడం వలన వస్త్ర పరిశ్రమలో సంక్షోభం ఏర్పడడంతో పాటు కార్మికులకు ఏడు నెలలుగా ఉపాధి లేకుండా పోయిందని అన్నారు. కార్మికులకు సరైన ఉపాధి లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఇప్పటివరకు 9 మంది కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని అన్నారు. ప్రభుత్వం వెంటనే దీన్ని రాజకీయ కోణంగా చూడకుండా సమస్యలను పరిష్కరించాలని అన్నారు. నూతన పరిశ్రమలు తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. పవర్‌లూమ్ పరిశ్రమలకు ఉచిత విద్యుత్ అందించాలని లేకుంటే గతంలో మాదిరిగా అన్ని కేటగిరీలకు విద్యుత్ సబ్సిడీ కొనసాగించాలని అన్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్లు, లేకుంటే జనతా వస్త్రాల పథకం ద్వారా ఒక చీర, ఒక పంచా సిరిసిల్లలో ఉత్పత్తి చేయించడంతో పాటు వర్కర్ టు ఓనర్ వెంటనే పూర్తిచేసి కార్మికులను యజమానులు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు యారన్ సబ్సిడీతో పాటు బతుకమ్మ చీరల పెండింగ్ బకాయిలను విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు కోడం రమణ, సిరిమల్లె సత్యం జవ్వాజీ విమల, సూరం పద్మ, అన్నల్‌దాస్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో క్యాబ్ డ్రైవర్ అనుమానాస్పద మృతి


గాండ్ల శ్రీనివాస్(ఫైల్)

నార్సింగ్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్షాకోట్ శాంతినగర్ బస్‌స్టాప్ వద్ద కారులో అనుమానస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన గాండ్ల శ్రీనివాస్ (34) హైదర్షాకోట్ వెస్ట్రెన్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. శ్రీనివాస్ వృత్తి రీత్యా కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శ్రీనివాస్ మూడు రోజులు నుంచి ఇంటికి రాలేదు. గురువా రం మధ్యాహ్నం శాంతినగర్ బస్‌స్టాప్ సమీపంలోని పార్కింగ్ ఏరియాలో కారులో నుంచి దుర్వాసన వస్తుండగా స్థానికులు గుర్తించారు. అనంతరం పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి పోలీసులు హుటాహుటిన చేరుకొని పరిశీలించారు. కారులో శ్రీనివాస్ మృతి చెందినట్లు కనిపించాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాసర ట్రిపుల్ ఐటీకి ఆదర్శ విద్యార్థి ఎంపిక

ధర్మారం, జూలై 4:మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థి సందనవేని సాయిమాదవ్ బాసరలోని ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ దీనాకుమారి తెలిపారు. గురువారం ఆదర్శ పాఠశాలలో విద్యార్థి సాయిమావ్‌ను ప్రిన్సిపాల్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

నియామకం

పెద్దపల్లి రూరల్, జూలై 4 : బీసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని చీకురాయి గ్రామానికి చెందిన జక్కుల సందీప్‌ను నియమించినట్లు బిసి విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు నారోజు రాకేష్ చారి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం జక్కుల సందీప్‌కు నియామక పత్రం అందించారు.

రోడ్డు మరమ్మతుకు ఎమ్మెల్యే హామీ

కాల్వశ్రీరాంపూర్, జూలై 4: కాల్వశ్రీరాంపూర్ పెద్దమ్మ టెంపుల్ నుంచి ఉవ్వకుంట ద్వారా హుస్సేన్‌మియా వాగుకు వెళ్లే రోడ్డు మరమ్మతుకు ఎమ్మెల్యే విజయరమణారావు నిధుల మంజూరుకు హామీ ఇచ్చినట్లు మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ తెలిపారు. హుస్సేన్‌మియా పరివాహక ప్రాంత రైతుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి నిధుల మంజూరిరు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఓపెన్ జిమ్‌ను ప్రారంభించిన వైస్‌ఎంపీపీ

పెద్దపల్లి రూరల్, జూలై 4 : మండలంలోని తుర్కలమద్దికుంట ప్రైమరీ పాఠశాల ఆవరణలో మండల పరిషత్ నిధుల నుంచి గ్రామస్థుల సౌకర్యార్థం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయగా గురువారం వైస్ ఎంపీపీ ముత్యాల రాజయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజులత, పంచాయతీ కార్యదర్శి మసీయొద్దిన్, సింగిల్‌విండోడైరెక్టర్ జైపాల్, ఏఈవో శీరిష, వెంకట్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీకి సన్మానం

కమాన్‌పూర్, జూలై 4 : కమాన్‌పూర్-1 ఎంపీటీసీ కోలేటి చంద్రశేఖర్ పదవీకాలం ముగిసిన సందర్భంగా మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ యూత్ నాయకులు గురువారం సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు బొమ్మగాని అనిల్‌గౌడ్, మహిళ విభాగం మండల అధ్యక్షురాలు పొన్నం రాజేశ్వరి, సిద్దిపల్లే మాజీ సర్పంచ్ తాటికొండ శంకర్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ గుర్రం లక్ష్మీమల్లు, నాయకులు నీలం శ్రీనివాస్, కమ్మగొని చలమయ్యగౌడ్, ఎలబోయిన రామ్మూర్తి, తోట రాజ్‌కుమార్, సాన సురేష్‌లతో పాటు తదితరులు ఉన్నారు.

'అయోమయం సృష్టించేందుకు కుట్ర'

కోల్‌సిటీటౌన్, జూలై 4: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని తమ పాఠశాలలపై అసత్య ప్రచారాలను నమ్మవద్దని, తమ విద్యాసంస్థలపై హైకోర్టు నుంచి ఎలాంటి ఉత్తర్వులు జారీ కాలేదని రావుస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్ సాదన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోట కుమార్ అనే వ్యక్తి ఉద్దేశ్యపూర్వకంగా తమపై అసత్య ప్రచారాలు చేస్తున్నాడన్నారు. గతంలో తమ సిబ్బందిపై దాడులు చేస్తే కేసులు పెట్టామని, వాటిని తొలగించుటకు తమపై అసత్య ప్రచారాలు చేస్తున్నాడని పేర్కొన్నారు.

పెద్దాపూర్‌లో రాజులదేవుని ఉత్సవ వేడుకలు

జూలపల్లి, జూలై 4 : మండలంలోని పెద్దాపూర్ గ్రామ పరిధిలో గల రాజులదేవుని ఉత్సవ వేడుకలను గురువారం గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామ శివారులో గల రాజులదేవునికి మొక్కులు చెల్లించేందుకు ప్రజలు తరలివెల్లారు. తగర భూమయ్య, దాడి నరేష్, సంకెండ్ల లక్ష్మి నర్సయ్య, ఆషాడ కైలాట్, కల్లెపెల్లి లింగయ్య, దాడి మల్లయ్య, తొగరి మల్లయ్య, కొండపెల్లి కృష్ణమూర్తి, తోట వెంకన్న, కంకనాల స్వామి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కాల్వశ్రీరాంపూర్, జూలై 4: మండలంలోని పెగడపల్లి, వెన్నంపల్లి గ్రామాల్లో జడ్పీ నిధులు రూ.10లక్షలు, మండల పరిషత్ రూ.10లక్షల నిధులతో మురికి కాలువ నిర్మాణం, కల్వర్టు నిర్మాణం పనులకు గురువారం జడ్‌పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, ఎంపీపీ నూనెటి సంపత్ శంకుస్థాపన చేశారు. ఎంపీటీసీలు సుముఖం నిర్మలమల్లారెడ్డి, జెట్టి దేవయ్య, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నూనేటి కుమార్‌యాదవ్, సుముఖం రవీందర్‌రెడ్డి, జంగా శ్రీనివాస్‌రెడ్డి, సుఖేందర్‌రెడ్డి, వెల్హారి రమేష్, కాసం విజేందర్‌రెడ్డి, కలవేన రమేష్, కారుకూరి సత్యనారాయణ, చొప్పరి శ్రీనివాస్ ఉన్నారు.

సుల్తాన్‌పూర్‌లో..

ఎలిగేడు, జూలై 4: మండలంలోని సుల్తాన్‌పూర్‌లో గురువారం పలు అభివృద్ధి పనులకు జడ్పీ వైస్‌ఛైర్‌పర్సన్ మండిగ రేణుకరాజనర్సు మాజీ ఎంపీపీ స్రవంతితో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం జడ్పీ వైస్‌ఛైర్‌పర్సన్, ఎంపీపీ దంపతులను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు.

బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేక అధికారులు



ఎలిగేడులో బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రత్యేక అధికారి భాస్కర్

ఎలిగేడు, జూలై 4 : ఎలిగేడు మండల ప్రత్యే అధికారిగా భాస్కర్ గురువారం పదవి బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ పాలకవర్గం పదవీకాలం ముగిసినందున ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నూతనంగా మండల ప్రత్యేక అధికారిగా భాస్కర్ జిల్లా మత్స్యశాఖ అధికారి నియమించారు. తదనంతరం ఎలిగేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం, అమ్మ ఆదర్శ పాఠశాల టాయిలెట్స్ పనులను ఆయన పరిశీలించారు. హైస్కూల్ హెచ్‌ఎం గంధ్ర దేవేందర్‌రావు, తాజా మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతి, ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో అనిల్‌రెడ్డి, ఏఈపీఆర్ జగదీష్, సూపరింటెండెంట్ మహేశ్వర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, సీఆర్‌పీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రామగిరిలో..

రామగిరి, జూలై 4: మండల పరిషత్ నూతన స్పెషల్ ఆఫీసర్‌గా(డిపివో) అశలత గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా తాజా మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శైలజా రాణి, ఎంపీవో మూల సమ్మిరెడ్డి, సూపరిండెంట్ ఉమేశ్, తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్‌లో..

కాల్వశ్రీరాంపూర్, జూలై 4: మండల ప్రత్యేక అధికారిగా జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి రంగారెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఎంపీపీల పదవీకాలం పూర్తి కావడంతో ప్రత్యేక అధికారిగా జె రంగారెడ్డి గురువారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ప్రత్యేక అధికారి రంగారెడ్డిని ఎంపీడీఓ రామ్మోహనచారి, సిబ్బంది రవి, సతీష్ పలువురు సన్మానించి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి, జూలై 4: ఎంపీపీ, వైస్‌ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యుల పదవీ కాలం గురువారంతో ముగిసింది. కలెక్టర్ ఆదేశాలతో మండల పరిషత్ పాలకుర్తికి మండల ప్రత్యేక అధికారిగా డీఎఫ్‌వో సీఎచ్ శివయ్య పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో పొల్సాని శశికళ, ఎంపీవో షబ్బీర్ పాషా, సీనియర్ సహాయకులు, జూనియర్ సహాయకులు దాడి శ్రీనివాస్, బోగే వెంకటేష్, తిరుపతి, సుచరిత, శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది తదితరులు పుష్పగుచ్ఛం అందించి శివయ్యను స్వాగతించారు.

జూలపల్లిలో..

జూలపల్లి, జూలై 4 : జూలపల్లి మండల పరిషత్ ప్రత్యేక అధికారిగా డీపీఎచ్‌వో రామస్వామి గురువారం మండల పరిషత్ కార్యాలయంలో తన పదవి బాధ్యతలను చేపట్టారు. అంతకు ముందు మండల పరిషత్ అధికారులు ఆయనకు స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో పద్మజ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

కోల్‌సిటీటౌన్, జూలై 4: నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై కేంద్రప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్ గురువారం గోదావరిఖనిలో విజయవంతమయ్యింది. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎస్‌యూఐ, డివైఎఫ్‌ఐ సంఘాల నాయకులు బంద్‌లో పాల్గొనని విద్యాసంస్థలను మూసివేయించారు. ఈ సందర్భంగా నాయకులు రేణుకుంట్ల ప్రీతం, బైరిమల్ల దుర్గాప్రసాద్, కొంటు సాగర్ మాట్లాడుతూ ఎన్‌టీఏ సంస్థ నిర్లక్ష్యం వల్ల నష్టపోయిన విద్యార్థులకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొలుగూరి సోను, ధనాల దినేష్, సంగె రాహుల్, గొడిసెల ప్రణీత్, వెంకటసాయి, దీపక్, శివ, శ్రీను, శ్రావణ్, వినోద్, కృష్ణ, సురేష్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, జూలై 4: మండలకేంద్రంలో ఎస్ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో గురువారం విద్యా సంస్థల బంధు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రామగల్ల సురేష్ మాట్లాడుతూ నీట్ సమస్యపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ కేంద్రంలో బీజేపీ, నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యార్థి, యువజన వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ, అన్ని విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో జూలై 4న అన్ని విద్యాసంస్థలు భారత్ బంద్‌ను విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ బంద్‌లో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులతో కలిసి విద్యార్థులు పాల్గొన్నారు.

ఓదెల, జూలై 4 : ఐక్య విద్యార్థి కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో ఇచ్చిన బంద్ పిలుపు మేరకు గురువారం మండలంలోని పాఠశాలల్లో బంద్ విజయ వంతమైంది. ఈ సందర్భంగా పలువురు విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షలను రద్దుచేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన విద్యార్థులకు పరిహారం చెల్లించాలని, అలాగే ఎన్ టి ఏ ను రద్దుచేసి పేపర్ లీకేజీకి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. నీట్ పరీక్షల నిర్వహణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ నాయకులు మార్క సతీష్, తాళ్లపల్లి సునీల్, కుమార్, సందీప్ పాల్గొన్నారు.

మహనీయుల స్ఫూర్తిని కొనసాగించాలి

- జడ్పీ చైర్మన్ పుట్ట మధు



పుట్ట మధు దంపతులను సన్మానిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

మంథని, జూలై 4: సమాజ హితం కోసం త్యాగాలు చేసిన మహనీయుల స్ఫూర్తిని ప్రజలంతా కొనసాగించినప్పుడే వారి త్యాగాలకు గుర్తింపు వస్తుందని పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు కోరారు. తెలంగాణ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి, సనాతన హిందూ ధర్మ ఆధ్యాత్మికవేత్త స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా స్థానికంగా ఉన్న వారి విగ్రహాలకు పుట్ట మధు గురువారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహనీయుల స్ఫూర్తిని ప్రజలకు చాటిచెప్పడానికి తాము మంథనిలో దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, సర్దార్ సర్వాయి పాపన్న, బీఆర్ అంబేద్కర్, బీపీ మండల్, జ్యోతిబా పూలే లాంటి అనేకమంది విగ్రహాలను ఏర్పాటు చేయించామన్నారు. వారి ఆశయ సాధన కోసం అందరు కృషి చేసినప్పుడే వారికి నిజమైన నివాళులర్పించినట్లు తెలిపారు. వారి పోరాట స్ఫూర్తితోనే నియోజకవర్గంలోని బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి, చైతన్యం కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు.

పుట్ట మధుకు బీఆర్ఎస్ శ్రేణుల ఆత్మీయ సన్మానం

పెద్దపల్లి జడ్పీ చైర్మన్‌పుట్ట మధు పదవీకాలం పూర్తి అయిన నేపథ్యంలో మంథని నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పుట్ట మధు, ఆయన సతీమణి పుట్ట శైలజను ఆత్మీయంగా సన్మానించారు. పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. అందరి సహకారంతోనే తాను ఐదేళ్ల పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్నట్లు పుట్ట మధు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

మహనీయులకు ఘన నివాళి

కమాన్‌పూర్, జూలై 4 : మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద గురువారం బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో మహనీయులకు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య, వివేకానంద వరంతి, అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు బొమ్మగాని అనిల్‌గౌడ్, మహిళ విభాగం మండల అధ్యక్షురాలు పొన్నం రాజేశ్వరి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ గుర్రం లక్ష్మీమల్లు, సిద్దిమల్లె మాజీ సర్పంచ్ తాటికొండ శంకర్, మాజీ ఎంపీటీసీ కోలేటి చంద్రశేఖర్, నాయకులు నీలం శ్రీనివాస్, కమ్మగొని చలమయ్యగౌడ్, ఎలబోయిన రామ్మూర్తి, తోట రాజ్‌కుమార్, సాన సురేష్, తాటిపల్లి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలోని గోకులనగర్‌లోని కురుమ సంఘం భవనంలో తెలంగాణ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని నిర్వహించారు.

ప్రభుత్వ భూమిపై కబ్జాదారుల కన్ను..

● ఓదెల-కొలనూర్ దారిలో రెండెకరాల 12 గుంటలు ఆక్రమణ



ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి

ఓదెల, జూలై 4 : అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఖరీదైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి. ఓదెల నుంచి కొలనూర్ వైపు నూతనంగా డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తికావడంతో కొందరు వ్యక్తులు రోడ్డు పక్కనున్న రెండు ఎకరాల 12 గుంటల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని సాగుకు సిద్ధం చేస్తున్నారు. మండల కేంద్రం నుంచి కొలనూర్ వైపు వెళ్లే బీటీ రోడ్డు పక్కకు ఉన్న ఈ ప్రభుత్వ భూమి పరిసరాల్లో ఎకరాకు రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ధర ఉంటుందని సమాచారం. అలాగే గ్రామంలోని పిట్టలోనికుంట కూడా పూర్తిగా ఆక్రమణకు గురయ్యింది. చెరువు విస్తీర్ణం దాదాపు 16ఎకరాల మేరకు ఉండగా, 12 ఎకరాల మేరకు కొందరు వ్యక్తులు ఆక్రమించుకొని సాగు చేస్తున్నట్లు పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఇదే విధంగా మండలంలోని కుంటల శికాలు పూర్తిగా ఆక్రమణకు గురై కుంటల ఆనవాళ్లు కోల్పోయాయి. వెంటనే అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.

కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలి

పెద్దపల్లిటౌన్, జూలై 4: రాష్ట్రంలో ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు జారీ చేయాలని న్యూ ఇండియా పార్టీ నాయకులు డాక్టర్ జేవి రాజు, వేముల అశోక్ డిమాండ్ చేశారు. ఎంతో మంది పేదలకు రేషన్ కార్డులు లేకపోవడంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్నో పథకాలకు నోచుకోకుండా పోతున్నారని వారు అన్నారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రేషన్‌కార్డులు లేని వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో రేషన్ కార్డుల గురించి చర్చ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా న్యూ ఇండియా పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎండీ ఫిరోజ్, మైసయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థులకు పతకాలు



బహుమతి అందుకుంటున్న విద్యార్థి

జ్యోతినగర్, జులై 4: బుధవారం రాత్రి హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన సెమ్స్ ఒలింపియాడ్‌లో ఎన్టీపీసీ విశ్వభారతి పాఠశాల విద్యార్థులు జాతీయ, రాష్ట్రస్థాయి పతకాలు సాధించారు. వెంకటనారాయణ, అక్షయ, వివేష్, అఫ్రీన్, నిక్షిప్త, నూరుద్దీన్, ఆజీ, ఫాతిమా, సహిస్తా మహవీన్‌లు జాతీయ, రాష్ట్రస్థాయి బహుమతులు గెల్చుకున్నారు. వీరికి సెమ్స్ ఆర్గనైజేషన్ కన్వీనర్ అరుకాల రాంచంద్రారెడ్డి, కో కన్వీనర్ ఎస్ఎన్‌రెడ్డి, సినీ నటుడు ప్రదీప్ బహుమతులు అందజేశారు. జాతీయ, రాష్ట్రస్థాయి బహుమతులు సాధించడం పట్ల విశ్వభారతి విద్యా సంస్థల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్, హెచ్‌ఎంలు తిరుపతిగౌడ్, నోయల్ జోసఫ్, ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

●కోల్‌సిటీటౌన్, జూలై4: సెమ్స్ ఒలింపియాడ్ జాతీయ స్థాయిలో రెండవ ర్యాంక్ సాధించిన గోదావరిఖని గీతాంజలి హైస్కూల్‌కు చెందిన ఎం.వైష్ణవికి రూ. 20వేల చెక్కును బహుమతిగా అందజేశారు. ఈనెల 3వ తేదిన హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన సెమ్స్ ఒలింపియాడ్ బహుమతి ప్రదానోత్సవంలో సినిమా, టీవీనటుడు ప్రదీప్ చేతుల మీదుగా రూ. 20వేల చెక్కును వైష్ణవి అందుకుంది. జాతీయస్థాయిలో ప్రతిభ కనపర్చి బహుమతిని అందుకోవడం పట్ల పాఠశాల కరస్పాండెంట్ కంది రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. కాగా ఈ కార్యక్రమంలో సెమ్స్ కన్వీనర్ అరుకాల రాంచంద్రారెడ్డి, కో ఆర్డినేటర్ ఎస్ఎన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు శంకుస్థాపన

ఓదెల, జూలై 4 : మండలంలోని హరిపురంలో గురువారం జడ్పీ నిధుల నుంచి రూ.2.54 లక్షల నిధుల వ్యయంతో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు కోసం మాజీ ఉప సర్పంచ్ జాహ్నవిని నాగరాజు శంకుస్థాపన చేశారు. లైట్ల ఏర్పాటు కోసం జడ్పీటీసీ గంట రాములు యాదవ్‌ను కోరగానే జడ్పీ నిధులను కేటాయించారని గ్రామంలో హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గంట రాములు యాదవ్, తుమ్మల లక్ష్మయ్య, మారబోయిన పర్వతాలు, మాకోటి ఓదెలు పాలకుర్తి రమేష్, బేరం రాజయ్య, గాజుల శివశంకర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సరిపడా బస్సులు లేక విద్యార్థుల ఇక్కట్లు

కళ్యాణ్‌నగర్, జూలై 3: రామగుండం మోడల్‌స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు సరిపడా బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇందిరానగర్ నుంచి రామగుండం మోడల్‌స్కూల్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సులో విద్యార్థులు ఫుట్‌బోర్డ్‌పై ప్రయాణించాల్సి వస్తోంది. బస్సుల సంఖ్య పెంచాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బస్సుల సంఖ్య పెంచాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దపల్లి రూరల్, జూలై 4: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్.స్వామి అన్నారు. గురువారం మండలంలోని రాఘవపూర్ మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలలో సైబర్ నేరాల పోస్టర్‌ను ఎస్‌ఐ ఆర్.స్వామి విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. సైబర్ నేరాల పట్ల కలిగే అనర్థాలను వివరించారు. మహిళల రక్షణ కోసం షీటీంలు పనిచేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిటౌన్, జూలై 4: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐలలో మిగిలి ఉన్న సీట్ల కోసం రెండవ విడత ప్రవేశాలకు జూలై 15 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ ప్రిన్సిపాల్ నరసింహాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణా సంస్థలలో 2024-25వ విద్యా సంవత్సరం ప్రవేశాలకు మిగిలి వున్న సీట్ల కోసం రెండవ విడత 10 వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ ఒరిజినల్ పదవ తరగతి మెమో, బోనఫైడ్, కులం, ఆధార్, టీసీ, ఇతర ధ్రువపత్రాలను స్కాన్ చేసి ఐటీఐ. తెలంగాణ. గోవ్. ఇన్ వెబ్ సైట్ నందు 100 రూపాయల వెరిఫికేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు

కళ్యాణ్‌నగర్, జూలై 4: బొగ్గు బ్లాకుల వేలాన్ని నిరసిస్తూ శుక్రవారం పెద్దపల్లిలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వామపక్ష పార్టీలు సీపీఎం నాయకులు ఎర్రవెల్లి ముత్యంరావు, సీపీఐ నాయకులు తాండ్ర సదానందం, కే కనకరాజు, న్యూడెమోక్రసీ నాయకులు విశ్వనాథం, అశోక్, దుర్గయ్య పిలుపునిచ్చారు. గురువారం భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సింగరేణిలో నూతన బొగ్గు బ్లాకులను వేలం వేయడం వల్ల సింగరేణి మనుగడకే ముప్పు వాటిల్లుతుందని, కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలాన్ని విరమించుకునే వరకు పోరాటం ఆగదని చెప్పారు. జూలై 6 నుంచి 12వ తేది వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలతో పాటు 17న వేలం వేసే కార్యాలయం ఎదుట ధర్నాను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఆసాల రమ,తాళ్లపల్లి మల్లయ్య, మార్కపురి సూర్య, మాటేటి శంకర్, శనిగరపు చంద్రశేఖర్, కనకయ్య, అబ్దుల్ కరీం, చంద్రయ్య పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి

కళ్యాణ్‌నగర్, జూలై 4: ప్రతి ఒక్కరూ తల్లిదండ్రుల పేరిట మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని బీజేపీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి అన్నారు. గురువారం 48వ డివిజన్ అడ్డగుంటపల్లిలో బీజేపీ బూత్ అధ్యక్షుడు మేరుగు శ్రీనివాస్ ఆధ్వర్యంలో 'ఏక్ పేడ్ మా కే నామ్' అనే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. అనంతరం ఇంటింటికి వెళ్లి మొక్కలను పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు పెద్దపల్లి రవీందర్, క్యాతం వెంకటరమణ, కోడూరి రమేష్, మహవాది రామన్న, సుల్వ లక్ష్మీనర్సయ్య, రాజ్‌కుమార్, గంధం అజయ్, అపర్ణ, రాజేశ్వరి, రంజిత, మంజుల, అనూష, సావిత్రి, లత, శ్రీరాములు, తిప్పర్తి స్వామి పాల్గొన్నారు.

●పెద్దపల్లి రూరల్, జూలై 4 : ప్రతి ఒక్కరికి ప్రాణవాయువు ఎంతో ముఖ్యమని, మొక్కలు విరివిగా నాటడం ద్వారా ప్రాణవాయువు లభ్యమవుతుందని పెద్దపల్లి జడ్పీటీసీ బండారి రామ్మూర్తి అన్నారు. గురువారం మండలంలోని చీకురాయి గ్రామంలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సుదర్శన్, ఈజీఎస్ జేఈ రాజయ్య, ప్లాంటేషన్ మేనేజర్ మధుకర్, పంచాయితి కార్యదర్శి రాధ, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేష్, ఫీల్డ్ అసిస్టెంట్ సమ్మయ్య పాల్గొన్నారు.



కలెక్టర్‌ను కలిసిన ఆర్జీ-2 జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 4: కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కోయ శ్రీహర్షను గురువారం ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన జీఎం సింగరేణి సంబంధిత విషయాలను వివరించారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీపై పలు సమస్యలను తెలియజేశారు. ఆర్జీ-2 ఏరియా బొగ్గు ఉత్పత్తి, రవాణా వంటి వివరాలను కలెక్టర్‌కు జీఎం వివరించారు. జీఎం వెంట ఆర్జీ-2 ఎస్ఎస్ఓ మహమ్మద్ ఫరీఫ్ ఉన్నారు.

ఓసీపీ-1లో వైద్య శిబిరం

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 4: ఓసీపీ-1 ప్రాజెక్టులో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కార్డియాక్ స్క్రీనింగ్ క్యాంప్‌ను గురువారం ప్రాజెక్టు ఆవరణలో ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు ప్రారంభించారు. ఈసందర్భంగా జీఎం మాట్లాడారు. జీఎం మాట్లాడారు. సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీర్ఘకాలిక, ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతున్న కారణంగా ముందస్తు జాగ్రత్తగా నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. మారుతున్న జీవన శైలితో ఆహారపు అలవాట్లతో అనేక రకాల అనారోగ్య కారణాలతో మరణాలు సంభవిస్తున్నాయని, వాటిని ముందుగా గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని జీఎం తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే వైద్య శిబిరాన్ని కాంట్రాక్టు ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జీఎం సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, బ్రాంచి సెక్రెటరీ రామచంద్రారెడ్డి, ఐఎన్‌టీయూసీ ఆర్జీ-3 వైస్‌ప్రెసిడెంట్ కోట రవీందర్‌రెడ్డి, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటరమణ, అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ నిర్వహణపై శ్రద్ధ చూపాలి

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 4: కార్మికవాడల్లో నెలకొల్పిన ఆర్వో వాటర్ ప్లాంట్ నిర్వహణపై యాజమాన్యం శ్రద్ధ చూపాలని కోరుతూ గురువారం సీఐటీయూ నాయకులు ఆర్జీ-2 యాజమాన్యానికి వినతిపత్రాన్ని అందజేశారు. ఏరియా డీజీఎం పర్సనల్‌ను కలిసి సమస్యను వివరించారు. కార్మిక వాడలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు కాలనీ, పోతనకాలనీల్లో యాజమాన్యం ఆర్వో ప్లాంట్‌లను ఏర్పాటు చేసిందని, కానీ వాటి నిర్వహణను సక్రమంగా పట్టించుకోక ఇబ్బందులు తలెత్తున్నాయని తెలిపారు. సమయానికి ప్లాంట్ తెరవకపోవడంతో కార్మికులే వేచి ఉండాల్సి వస్తున్నదని, ప్లాంట్ వద్ద రద్దీ పెరిగి ఇబ్బందికరంగా ఉంటున్నట్లు పేర్కొన్నారు. వాటర్ ప్లాంట్ ముందు షెడ్డు నిర్మించాలని, కార్మిక కుటుంబాల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని మరొక ప్లాంట్ ఏర్పాటు చేయాలని ప్రస్తుత ఆర్వో ప్లాంట్ సామర్థ్యం పెంచాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ ఆర్జీ-2 కార్యదర్శి కుంట ప్రవీణ్ కుమార్, అధ్యక్షుడు వినయ్, ఉపాధ్యక్షుడు ఎస్ వెంకన్న, నాయకులు సంపత్, రాంప్రసాద్‌లు ఉన్నారు.

బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐఎన్‌టీయూసీ ధర్నా



ఆర్జీ-2 జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

గోదావరిఖని, జూలై 4: బొగ్గుబ్లాకుల వేలంపాటు, ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్(ఐఎన్‌టీయూసీ) ఆధ్వర్యంలో గురువారం సింగరేణి వ్యాప్తంగా జీఎం కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆర్‌జీ-1 జీఎం కార్యాలయం ముందు ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా జరిగింది. ఈ కార్యక్రమానికి ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి హాజరయ్యారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు వికాస్, ఆరెల్లి శ్రీనివాస్, దేవులపల్లి రాజేందర్, బత్తుల పోచయ్య, మల్లికార్జున్, గడ్డం కృష్ణ, నాగరాజు, జగన్మోహన్, నీరటి సాగర్, గుండేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 4:బొగ్గు బ్లాక్‌ల వేలం ప్రక్రియకు వ్యతిరేకిస్తూ గురువారం ఆర్జీ-2 జీఎం ఆఫీస్ ఎదుట ఐఎన్‌టీయూసీ శ్రేణులు ధర్నా చేశాయి. ఈసందర్భంగా ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. సంపత్‌రెడ్డి, శంకర్‌నాయక్, రవీందర్‌రెడ్డి, కృష్ణ, కర్క శ్రీనివాస్, భీముని సత్యనారాయణ, ఉస్మాన్ పాల్గొన్నారు.

రామగిరి, జూలై 4: బొగ్గు గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకిస్తూ గురువారం జీఎం కార్యాలయంలో ఎదుట ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఐఎన్‌టీయూసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి, గడ్డం తిరుపతి, రామారావు, భిక్షనాయక్ తదితరులున్నారు.

గనుల వేలానికి ఐఎన్‌టీయూసీ వ్యతిరేకం

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 4: ఓసీపీ-1 ప్రాజెక్టులో బొగ్గు గనుల వేలానికి నిరసనగా గురువారం ఐన్‌టీయూసీ సెంట్రల్ కమిటీ సభ్యుడు గడ్డం తిరుపతి ఆధ్వర్యంలో కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఐఎన్‌టీయూసీ బొగ్గు గనుల వేలం, ప్రైవేటీకరణకు వ్యతిరేకమని తిరుపతి అన్నారు. పిట్‌సెక్రెటరీ వెంకటస్వామి, సారయ్య, ప్రభాకర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, వినయ్, రఘు, శ్రీనివాస్, సంజీవయ్య కార్మికులున్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

బొగ్గు గనుల వేలం ప్రక్రియను వ్యతిరేకిస్తూ ఈనెల 5న కలెక్టర్ ఆఫీస్ ఎదుట చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం ఆర్జీ-2 గౌరవ అధ్యక్షుడు ఉల్లి మొగిలి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగిన డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర కార్మిక సంఘాల నిర్ణయం మేరకు కలెక్టరేట్‌ల ఎదుట ధర్నాలు చేయనున్నట్టు తెలిపారు. 5వ తేదీన ధర్నాకు కార్మికులు,కాంట్రాక్టు కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. భూమయ్య, లక్ష్మీనారాయణ, రవి, రామన్న, రాజు, జయరాజు పాల్గొన్నారు.

రాష్ట్రంలోని బొగ్గు బ్లాక్‌లు సింగరేణి సొత్తు

రాష్ట్రంలోని బొగ్గు బ్లాక్‌లు సింగరేణి సొత్తు అని ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు పేర్కొన్నారు. గురువారం ఓసీపీ-1 సైటాఫీస్‌లో జరిగిన గేట్ మీటింగ్‌లో వైవీ రావు, గడ్డం తిరుపతిలు మాట్లాడారు. బొగ్గు వెలికితీతలో అపార అనుభవం, నైపుణ్యం గల కార్మికులు ఉన్న సింగరేణికి కాకుండా ప్రైవేట్ సంస్థలకు బొగ్గు గనులు కట్టబెట్టడం అన్యాయమైన విషయమని పేర్కొన్నారు. సింగరేణి ఉనికి ప్రమాదంగా ఉన్న వేలం ప్రక్రియను ఇకనైనా కేంద్రం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రం దిగివచ్చే వరకు దశలవారి ఆందోళనలకు కార్మికులు కలసి రావాలని పిలుపునిచ్చారు. అన్ని కార్మిక సంఘాలు, కార్మిక వర్గం ఏకతాటిపై ఉండి పోరాడితే గనులు దక్కుతాయన్నారు. ఈ గేట్ మీటింగ్‌లో జూపాక రాంచందర్, ఎంఆర్‌సీ రెడ్డి, వెంకటస్వామి,సారయ్య, తిరుపతిరావు, మల్లేష్, సాంబయ్యలు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకుల వేలాన్ని నిలిపివేయించాలి

- ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య

గోదావరిఖని, జూలై 4: సింగరేణి బొగ్గు బ్లాకులను వేలం వేయకుండా బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి నిలిపివేయించాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆర్‌జీ-1 పరిధిలోని జీడీకే 2ఇంక్లైన్‌లో జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం కోట్ల రూపాయలు ఖర్చు చేసి బొగ్గు నిక్షేపాలను గుర్తించిన నూతన బొగ్గు బ్లాకులను కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించకుండా వేలం ద్వారా ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వడాన్ని ఏఐటీయూసీ తీవ్రంగా వ్యవతిరేకిస్తుందన్నారు. దేశంలో 3వసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం దేశంలోని బొగ్గుగనులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం సరైంది కాదన్నారు. తెలంగాణలో ఉన్న బొగ్గు బ్లాకులను ఇతర రాష్ట్రాలకు ఇచ్చిన విధంగా నామినేషన్ పద్ధతిలో సింగరేణికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ బిడ్డగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే సింగరేణి రక్షణకు పాటుపడాలని కోరారు. తెలంగాణలోని బొగ్గు బ్లాకులను వేలం వేస్తే సింగరేణికి మనుగడ ఉండదన్నారు. ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా గెలిచిందనే అక్కసుతో కొన్ని సంఘాలు రెండు సంవత్సరాల కాలపరిమితి పెట్టాలనడం సరికాదన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు మడ్డి ఎల్లయ్య, కవ్వంపెల్లి స్వామి, రంగు శ్రీనివాస్, మాదన మహేష్, గండి ప్రసాద్, సతీష్‌బాబు, ఎంఏ గౌస్, రామస్వామి, మల్లేష్, తొడుపునూరి రమేష్, సమ్మయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.